
''అనంతకోటి ప్రేమలకు శతకోటి ఉపాయాలు!
అందమైన అమ్మాయిల గుండెల్లోకి సూటిగా మన్మథబాణాలు!
పడుచుగుండె వుబలాటం దేముడికే తెలుసు!
వయస్సులోన కుర్రవాడు 'లవ్వంటే'నే సొగసు!''

రోజూ పొద్దునే సుప్రభాతంలా పై వాక్యాలు చదువుకొని రాత్రి పడుకొనేవరకు కనీసం పది నిముషాలకొకసారేనా స్మరించుకొని, నిద్రబోయేటప్పుడు మాట ఎనిమిదిసార్లు 'ప్రేమ జపం' చేసే జానకిరావ్ ... ఇదేమిటి? ... ఈ వేషంలో ...

# భక్తుడు

— ఆకెళ్ళ శివప్రసాద్



మనిషి పూర్తిగా మారిపోయాడు ...
నిజం ... మీ మీద ఒట్టు!

* * *

జానకి రావ్ మారిపోయాడు ...
అర్జెంటుగా భక్తుడయిపోయాడు ...
రోజూ తెల్లారకుండానే నాల్గు గంటలకే లేచి తల స్నానం చేసి, మొహాన్న అంత విబూది, ఇంత గంధము, కాస్త కుంకుమ పూసి, అష్టోత్తరాలు, సహస్రాలు చేస్తూ, గట్టిగా అరుస్తూ, రూమంతా నానా హడావిడి చేస్తున్నాడు. రోజూ ఆరు గంటలకి రేడియోలో వచ్చే సుప్రభాతంతో స్వరం కలుపుతున్నాడు ... సాయంత్రం ఆరు గంటలకి దగ్గర్లో వున్న గుడికి వెళ్తున్నాడు ...

ఏ రోజూ ఎనిమిది గంటలు అయినా లేవనివాడు, ఎప్పుడూ మొహాన్న బొట్టుపెట్టే ఎరగనివాడు, అష్టోత్తరాలు వగైరాలు నోరుతిరగక శ్రమపడ్తుంటే విపరీతంగా నవ్వొస్తోంది. సాయంత్రం గుడికెళ్తుండడం మరో ఆశ్చర్యకరమైన విషయం. పండగలప్పుడు మేమైనా వెళ్ళేవాళ్ళం కానీ వాడు వచ్చేవాడు కాదు.

మా రూమ్‌లో ముగ్గురం. నేనూ, జానకిరావ్, కిషోర్. కిషోర్ కీమధ్యే పెళ్ళవడంచేత వేరే ఇల్లు తీసుకున్నాడు. ప్రస్తుతం నేను, జానకిరావ్ వున్నాం గదిలో —

నేను వారం క్రితం ఆఫీసు పని రీత్యా క్యాంప్‌కెళ్ళవలసి వచ్చింది.

వారం రోజుల క్రితం వున్న రూమ్‌లా లేదు ఇప్పుడు—

ఆకారం పూర్తిగా మారిపోయింది.

అప్పుడు ...

గోడల నిండా ఆరాధ్య దైవాలైన సినీతారల ఫోటోలు

ఇప్పుడు ...

అటువైపు ఏడు కొండల వెంకన్న ... ఇటు వైపు బెజవాడ దుర్గమ్మ ... గుమ్మానికి ఎదురుగా సీతా రాములు ...!

వారపత్రికలు, నవల్సు వుండే చోట యిప్పుడు సుప్రభాతాలు, సహస్రనామాలు వెలిశాయి—

ఏమిటబ్బా వున్నట్టుండి వీడిలో ఇంత మార్పు?

ఏ అమ్మాయైనా ఆలోచించకుండా నలుగురిలో పట్టుకొని ఎడాపెడా వాయించేసిందా?

ప్రేమ పోరాటంలో ఓడిపోయిన 'క్షతగాత్రుడు' కాదు కదా జానకీరావ్?

తెల్లారుఝామున నీళ్ళుపోసుకోవడం వలన తెగ తుమ్ముతున్నాడు ... కళ్ళు నిద్రాభంగానికి కలత చెందినట్టున్నాయి.

నేను రూమ్‌కి వచ్చి దాదాపు అరగంట దాటింది...

కనీసం నావైపైనా చూడకుండా వాడి ధోరణిలో వాడున్నాడు ...

మొహాన్న బొట్లు పెట్టుకుని, తడి తువ్వాలు చుట్టుకొని, ఏవో మంత్రాలు (?!) చదువుతూ, టేబుల్ మీద వున్న అగరవత్తులు వెలిగిస్తూ, హారతి కర్పూరం వెలిగించి దేముడి పటం చుట్టూ తిప్పుతూ, గణగణమంటూ గంట వాయిస్తూ ... టపటప లెంపలు బాదుకుంటూ నానా 'గోల' చేస్తున్నాడు.

"ఒరేయ్ కాఫీ పెట్టావా?" వాడికి విన్పించేలా గట్టిగా అడిగాను. వాడు నాకేసి కోపంగా చూసి —

" 'మడి'లో వున్నాను ... నన్ను మాట్లాడించకు..." అన్నాడు పూజ కొనసాగిస్తూ—

వాడి సమాధానం విని, ఇక లాభం లేదనుకొని మెల్లగా హోటల్‌కి బయలుదేరాను—

మధ్య దారిలో కిషోర్ కన్పించాడు. జానకిరావ్ విషయం వచ్చినప్పుడు, "రెండు రోజుల క్రితమే వాడ్ని చూశానురా? ... ఆ నామాలు ... ఆ మనిషి ... సన్యాసుల్లో కలిసిపోతాడేమోనని భయంగా వుందిరా..." అన్నాడు కిషోర్. వాడికీ జానకిరావ్ ఎందుకలా అయ్యాడో తెలీదట—



ఇటీవల శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో నృత్యం చేసి సభికులను అలరించిన చిరంజీవి మణిమాల, సత్కరిస్తున్న స్థానిక జేసీస్ అధ్యక్షుడు భీమశంకరరావ్.

మే మిద్దరం మాట్లాడుకుంటూ, హోటల్లో కాఫీ త్రాగేసి, రూమ్‌కి చేరుకున్నాం—

జానకిరావ్ మేము వచ్చిన వెంటనే మాకేసి ఓ బాణం లాంటి చూపు విసిరి గోడలకి చెప్తున్నట్టు" గుడి కెళ్తున్నాను... ఎవరైనా నా కోసం వస్తే కూర్చోమని చెప్పు"

"ఏమిట్రా వీడి సంగతి?" అడిగాడు కిషోర్

"తేలుద్దాం." అన్నాను నేను.

ఆ రోజు నుండి చిన్న సైజు డిటెక్టివ్ లాంటిది మొదలుపెట్టాం... రెండు రోజుల్లోనే మాకు 'రిజల్ట్' వచ్చింది... మా వూహ నిజమైతే... నిజమా?... కాదా?... మరో పథకం వేశాం!

* * * *

ఆరోజు జానకిరావ్ బయట నుండి వచ్చేసరికి గదిలో చిన్న మార్పు చేశాం... అటు వైపు కిటికీకి ఎదురుగా వున్న దేముడి పటాలు వగైరాల్ని ఇటు వైపు జరిపి, కిటికీకి అడ్డుగా పెట్టాం—

వాడు వచ్చిన వెంటనే మార్పును గమనించి, మాకేసి కోపంగా చూస్తూ—

"ఎవడ్రా ఈ టేబులు, పటాలు మార్చింది?" అని అడిగాడు "మేమే!" కంబైన్డ్‌గా అన్నాం—

"ఏం రోగమొచ్చింది?"

"ఎక్కడుంటే ఏం..." అన్నాను నేను.

"నాయిష్టమొచ్చినట్టు టేబుల్‌ని మార్చుకున్నాను... మీ రెవరు మార్చడాన్కి..."

"అబ్బా గట్టిగా అరవకురా... ఇంటాయన వింటే 'ఏదో' అయిపోతోందనుకుంటాడు..."

"అయినా... ఎక్కడుంటే ఏమిట్రా?..." సముదాయిస్తున్నట్టు అడిగాడు కిషోర్.

"ఒరేయ్! ప్లీజ్ రా..." బతిమాలడం ప్రారంభించాడు.

"ఏం?"

"ఎందుకు?"

ఇక తప్పదన్నట్టు చెప్పేశాడు"

మేము వూహించింది నిజమే...!

టేబుల్ని! వగైరాల్ని వాడిష్ట ప్రకారమే మార్చేశాం. మావాడికి! కార్యక్రమం మామూలుగానే సాగుతోంది" హడావిడి... స్తోత్రాలు... హారతులు... అగరవత్తులు... ఇంతకీ అసలు విషయ మేమిటంటే—

నేను క్యాంప్ కెళ్ళిన మర్నాడే మా ఎదురింట్లో ఓ ఫ్యామిలీ దిగింది.

ఆ కుటుంబంలో ఓ అందమైన అమ్మాయి.

ఆ మర్నాడే మావాడు కష్టపడి ఆ ఫ్యామిలీకి సంబంధించిన వివరాలు సేకరించాడు.

ఆ ఫ్యామిలీలో తరతరాలుగా భక్తులున్నారని, ఆ కుటుంబంలో వాళ్ళు 'భక్తులంటే' ఇష్ట పడ్తారని, ఒకప్పుడు అందమైన అమ్మాయి నాన్న కూడా, వాళ్ళమ్మ కోసం భక్తుడయి పోయాడని తెలుసుకొని మా జానకీరావ్ అర్జెంటుగా భక్తుడయిపోయాడు.

ఆ అమ్మాయిని చూసి ఫస్ట్ సైట్‌లోనే ఎట్రాక్ట్ అయిపోయి, వేషం మార్చేశాడు.

ఇక టేబుల్ విషయ మంటారా?

ఆ టేబుల్‌కి ఎదురుగా వున్న కిటికీలోంచి 'అంతా' కన్పిస్తుంది ఎదురింటి వాళ్ళకి—

రోజు గుడికి... దైవదర్శనం కన్నా 'దేవీ దర్శనం' కోసం—

మేము రెండు రోజుల్లో వాడి విషయాన్ని కని పెట్టాం కానీ... వాడు వాడి హడావుడిలో ఇన్ని రోజులయినా మరో విషయం గమనించలేదు...

అదేమిటంటే...

ప్రస్తుతం మా వీధిలో సగం మంది కుర్రకారు

భక్తులే!

